నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, గురువారం 22 ఫిబ్రవరి 2024 | KAMAREDDY

## మంచం పడుతున్న పల్లెలు

**నిజామాబాద్ జిల్లాలో పెరుగుతున్న ఫీవర్ కేసులు**

**వైద్యులు, సిబ్బందికి సెలవులను రద్దు చేసిన సర్కారు**

**బాధితులకు సత్వరం చికిత్స అందేలా చర్యలు**

**పరిస్థితి అదుపులోనే ఉన్నదన్న వైద్యాధికారులు**

**పరిశుభ్రత పాటించాలని సూచన**


**పల్లెలు మంచం పడుతున్నాయి.** పట్టణాల్లో వ్యాధులు విజృంభిస్తున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు చుట్టుముట్టాయి. ప్రజలను జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. దీనికితోడు డెంగీ కోరలు చాచడంతో ప్రభుత్వం అప్రమత్తత ప్రకటించింది. డాక్టర్లు, వైద్య సిబ్బందికి సెలవులను రద్దు చేసింది. అత్యవసరం ఉంటే తప్ప.. సెలవులు ఇవ్వొద్దని ఆదేశించింది. వ్యాధుల నియంత్రణకు సమష్టిగా పనిచేయాలని సూచించింది. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖ అలర్ట్ అయ్యింది.

–ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 21

# డెంగీ కోరలు



జీజీహెచ్ ఓపీ కౌంటర్ వద్ద బారులుతీరిన రోగులు



వైరల్ ఫీవర్స్‌తో నిజామాబాద్ జిల్లా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో రెండు ఏరియా దవాఖానలు, 22 పీహెచ్‌సీలు, పది అర్బన్ సెంటర్లు, 8 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో నమోదవుతున్న వ్యాధుల వివరాలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. రోగులను దవాఖానకు తరలించి చికిత్స అందేలా చర్యలు చేపడుతున్నారు. సరిపడా మందులు అందుబాటులోఉన్నాయని డిప్యూటీ డీఎంహెచ్‌వో, మలేరియా అధికారి తుకారాం రాథోడ్ తెలిపారు.

**జిల్లాలో 56 డెంగీ కేసులు..**

మలేరియా, టైఫాయిడ్‌తోపాటు వైరల్ ఫీవర్స్‌తో ప్రజలు సతమతం అవుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 56 డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రైవేటు దవాఖానలు సైతం రోగులతో కిటకిటలాడుతున్నాయి. అయితే, పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉన్నదని వైద్యాధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో డెంగీ మరణాలు నమోదు కాలేదని తెలిపారు.

**పారిశుద్ధ్యం అస్తవ్యస్తం..**

పల్లెలతోపాటు పట్టణాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఇటీవలే ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహించినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. అధికారులు మొక్కుబడిగా వారోత్సవాలు నిర్వహించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్కడి చెత్త అక్కడే ఉన్నదని, మురికి కాల్వలు శుభ్రం చేయాలేదని, వీధులన్నీ కంపుకొడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దోమల నివారణ చర్యలు శూన్యం..**

జ్వరాలకు ప్రధాన కారణమైన దోమల నివారణకు అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మురికి కాల్వల్లో పూడిక తీయడంతోపాటు ఆయిల్ బాల్స్ వేయడం, రసాయనాల పిచికారీ వంటివి పట్టించుకోవడంలేదు. ఫాగింగ్ మిషన్లను మూలన పడేశారు. దీంతో దోమలు ఎక్కువయ్యాయి. వైద్యాధికారులు మాత్రం ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచిస్తున్నారు. త్వరలోనే జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందాలతో అవగాహన కల్పిస్తామని అంటున్నారు.

**కిటకిటలాడుతున్న జీజీహెచ్..**

నిజామాబాద్ నగరంలోని జిల్లా ప్రభుత్వ దవాఖాన రోగులతో కిటకిటలాడుతున్నది. వైరల్ ఫీవర్స్ దాడితో ఓపీ, ఇన్ పేషెంట్ల సంఖ్య మరింత పెరిగింది. ప్రతిరోజూ 1500–1700 ఓపీ నమోదవుతున్నట్లు సిబ్బంది తెలిపారు. ఇన్‌పేషెంట్లతో బెడ్లు ఫుల్లుగా నిండిపోయాయి. భయపడాల్సిన పనిలేదని, రోగుల తాకిడి, చికిత్సపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ తెలిపారు.



### మెరుగైన వైద్యం అందిస్తున్నాం..



జిల్లాలో ఫీవర్ కేసులు పెరిగాయి. దీంతో ప్రభుత్వ దవాఖానకు రోగులు ఎక్కువగా వస్తున్నారు. అవసరమైన వారికి మందులు ఇస్తున్నాం. అత్యవసరమైతే అడ్మిట్ చేసుకొని నిపుణుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నాం. రోగులకు ఇబ్బంది కాకుండా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

**-ప్రతిమారాజ్, జీజీహెచ్ సూపరింటెండెంట్, నిజామాబాద్**


### పరిసరాల శుభ్రత పాటించాలి..



జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలను చాలావరకు నియంత్రించవచ్చు. నిత్యం చేతులను శుభ్రంగా ఉంచుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగడం మంచిది.

**-సుదర్శనం, డీఎంహెచ్‌వో, నిజామాబాద్**

## లడాఖ్ శిఖరంపై అన్నాసాగర్ వాసి



లడాఖ్ శిఖరంపై అన్నాసాగర్ ప్లకార్డును చూపుతున్న గ్రామవాసి

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 21: మండలంలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన మహ్మద్ షాదుల్ భారత సైన్యంలో విధులు నిర్వహిస్తున్నాడు. అతడు సముద్రమట్టానికి 18వేల అడుగుల ఎత్తులో మైనస్ 38డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న లడాఖ్ శిఖరాన్ని చేరుకున్నాడు. అక్కడ అన్నాసాగర్ ప్లకార్డును ప్రదర్శించాడు. గ్రామస్తులతోపాటు మండల ప్రజలు అతడికి అభినందనలు తెలుపుతూ.. సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

## అడవిబిడ్డల మార్గదర్శి.. సంత్ సేవాలాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

**ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి**

భీమ్‌గల్, ఫిబ్రవరి 21: అడవిబిడ్డల మార్గదర్శి, బంజారా బిడ్డలకు హిందూ దైవం గొప్పతనాన్ని తెలియజేసిన మహానుభావుడు సంత్ సేవాలాల్ మహరాజ్ అని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. భీమ్‌గల్ పట్టణంలోని బంజారాభవన్‌లో బుధవారం నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి అధికారిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. బంజారాల అభ్యున్నతికి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. నూతన జీపీలు, సీసీ రోడ్లు, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, పోడు పట్టాలు అందజేయడం లాంటి కార్యక్రమాలు చేశామన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో రూ.50లక్షలతో బంజారా భవన్ నిర్మించామన్నారు. ప్రతి తండాకు తీజ్ భవనాలు మంజూరు చేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ పనులను ఆపివేయాలని అన్నట్లు సమాచారమున్నదని, తండా పెద్దమనుషులు అధికారులను కలిసి ఆ పనులను ప్రారంభించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఆపాలనుకోవడం సరికాదని, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని పనులను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అధికారి నాగూరావు, జడ్పీటీసీ రవి, కన్నె సురేందర్, బంజారా నాయకులు శర్మానాయక్, తుక్కాజి, లింగం, తిరుపతి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆచరణకు నోచుకోని కాంగ్రెస్ హామీలు

**70రోజులైనా రూ.లక్ష, తులం బంగారం ఊసేలేదు**

**పాత చెక్కులనే పంపిణీ చేయిస్తున్న సర్కారు**

**బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి

వర్ని, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 70రోజులు కావస్తున్నా ఎన్నికల హామీలు ఇప్పటికీ పూర్తిగా అమలు కాలేదని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. వర్ని, చందూర్, మోస్రా, రుద్రూరు, కోటగిరి మండలాలకు చెందిన 166మంది లబ్ధిదారులకు బుధవారం వర్ని మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో 13లక్షల మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద రూ.11వేల కోట్లను పంపిణీ చేశామన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 16వేల మందికి రూ.130కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. ఇప్పటికీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంజూరు చేసిన కల్యాణలక్ష్మి చెక్కులనే పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ఇస్తామన్న రూ.లక్షతోపాటు తులం బంగారం హామీ ఇప్పటి వరకు ఆచరణకు నోచుకోలేదని విమర్శించారు. మహిళలకు రూ.2500, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే సిలిండర్, రైతుబంధు, రుణమాఫీ, రూ.4వేల పింఛన్‌లాంటి హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటి వరకు వాటి ఊసే ఎత్తలేదని, ఇండ్ల కోసం 84లక్షల దరఖాస్తులు వచ్చాయని వాటికి బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించలేదన్నారు. బాన్సువాడ, వర్ని, కోటగిరిలో దవాఖానలు నిర్మించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వర్ని, రుద్రూరు జడ్పీటీసీలు బర్దావల్ హరిదాస్, నరోజి గంగారాం, బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, రైతుబంధు సమితి వర్ని మండల అధ్యక్షుడు సింగంపల్లి గంగారాం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దండ్ల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి..

గిడ్డంగిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



బిచ్కుంద, ఫిబ్రవరి 21: జుక్కల్ నియోజకవర్గాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలో రూ.36లక్షలతో రైతు సేవా సహకార సంఘం ఆవరణలో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గిడ్డంగిని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ అశోక్ పటేల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాల్చర్ రాజు, సొసైటీ చైర్మన్ నాల్చర్ బాలు, వైస్ చైర్మన్ యాదారావు తదితరులు పాల్గొన్నారు.

**మాజీ జడ్పీటీసీ సంగీత వినూత్న కార్యక్రమం**

## ఆడబిడ్డ పుడితే రూ.5వేలు



చిన్నారి కుటుంబానికి రూ.5వేలు అందిస్తున్న మాజీ జడ్పీటీసీ జోగు సంగీత

ముప్కాల్, ఫిబ్రవరి 21: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉమ్మడి బాల్కొండ మాజీ జడ్పీటీసీ జోగు సంగీతానర్సయ్య వినూత్న కార్యక్రమం చేపట్టారు. ముప్కాల్ మండల కేంద్రంలో ఆడబిడ్డ పుట్టిన కుటుంబానికి తన సొంత డబ్బులు రూ.5వేలు ఇస్తానని మాట ఇచ్చారు. ఇందులో భాగంగా ముప్కాల్‌లో ఓ చిన్నారి కుటుంబానికి బుధవారం రూ.5వేల డిపాజిట్ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింగ్ దాస్ ఉన్నారు.

## జీతాలు మహాప్రభో..

**కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు నిలిచిన వేతనాలు**

**రెండు నెలలుగా ఎదురుచూపులు**

**కుటుంబాల పోషణకు కష్టాలు**

**ఇచ్చిన హామీ నిలుపుకోవాలంటున్న అంగన్‌వాడీలు**



కరీంనగర్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కలెక్టరేట్: 'ఓడెక్కేదాకా ఓడ మల్లన్న.. ఓడ దిగినంక బోడి మల్లన్న' అన్నట్టుగా ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. శాసన సభ ఎన్నికలకు ముందు ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించిన ఆ పార్టీ, ఇప్పుడు అమలులో మాత్రం చోద్యం చూస్తున్నది. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులతోపాటే జీతాలు విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చింది. తీరా గెలిచిన తర్వాత జీతాలు పెంచడం దేవుడెరుగు? ఉన్న జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. ఫలితంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురు చూడాల్సి వస్తున్నది.


**నాడు ఆదుకున్న కేసీఆర్ సర్కారు**

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ, ఆరేండ్లలోపు బాలలకు ఆటాపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యనందిస్తున్నారు అంగన్‌వాడీలు. అలాగే ప్రభుత్వం నిర్వహించే అనేక కార్యక్రమాల్లో భాగస్వాములవుతారు. అయినా నాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. వేతనాలు పెంచాలని అనేక ఆందోళనలు చేసినపుడల్లా కంటితుడుపుగా వందో.. రెండొందలో పెంచేవారు. అవి ఏ మూలకూ సరిపోయేది కాదు. కానీ, కేసీఆర్ సర్కారు వచ్చిన తర్వాత ఆ పరిస్థితి మారింది. కీలక సేవలందిస్తున్న అంగన్‌వాడీలకు సముచిత స్థానం కల్పించింది. కేంద్రంతో సంబంధం లేకుండా ఈ చిరుద్యోగుల సంక్షేమాన్ని చూసుకున్నది. తెలంగాణ వచ్చినప్పుడు అంగన్‌వాడీ టీచర్లకు కేవలం ₹3,200, హెల్పర్లకు ఇంకా తక్కువ వేతనం ఉండగా, రాష్ట్రం వచ్చిన వెంటనే వీరికి వేతనాలు పెంచింది. టీచర్లకు నెలకు ₹13,650, హెల్పర్లకు ₹7,800 వేతనం అందించింది. ఏ రాష్ట్రంలో కూడా ఇంతగా వేతనాలు పెంచలేదు. ఆ తర్వాత ప్రభుత్వోద్యోగులకు ఇస్తున్నట్టుగా రెండు సార్లు పీఆర్సీ అమలు చేసింది. అయితే కరోనా విపత్కర కాలంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నా.. సంక్షేమాన్ని మాత్రం ఆపలేదు. ఉద్యోగులకు వేతనాలు కాస్త ఆలసమయ్యాయి కానీ, ఏ నెల కూడా వేతనాలను ఆపలేదు.

**నేడు జీతాల కోసం ఎదురుచూపు..**

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలిచ్చింది. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని, ప్రభుత్వోద్యోగులతో కలిపి ఏనెలకు ఆ నెల ఒకటో తారీఖున విడుదల చేస్తామని చెప్పింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 75 రోజులు గడిచింది. కానీ, ఇప్పటి వరకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు జీతాలు విడుదల చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 35వేల సెంటర్లలో పనిచేస్తున్న దాదాపు 65 వేల అంగన్‌వాడీలు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. జీతాలు పెంచడమేమో గానీ, ఉన్న జీతాలు కూడా సక్రమంగా పంపిణీ చేయడం లేదని మండిపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఏరు దాటినంక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తున్నదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. జీతాలు లేక తమ కుటుంబాల పరిస్థితి కడుదయనీయంగా మరిందని, అప్పులు చేయాల్సి వస్తున్నదని కన్నీటి పర్యంతమవుతున్నారు. తామ గోడు వెళ్లబోసుకునేందుకు కనీసం కాంగ్రెస్ నాయకుల సమయం కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే జీతాలు విడుదల చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

## రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్/నవీపేట,ఫిబ్రవరి 21: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం తక్కువ వడ్డీతో ఇస్తున్న రుణాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. నవీపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో యూనియన్ బ్యాంక్ నవీపేట, బోధన్ బ్రాంచీ ఆధ్వర్యంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు రూ. 11కోట్ల రుణాల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. యూబీఐ డీజీఎం హేమ్‌రామ్, ఏజీఎం శివకోటయ్య, ఏపీడీ రవీందర్, డీపీఎం నీలిమా కులకర్ణి, ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

**సేవాలాల్ జీవితం స్ఫూర్తిదాయకం..**

బోధన్ పట్టణంలోని అప్పా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి, భోగ్ భండార్‌లో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. సేవాలాల్ మహరాజ్ జీవితం స్ఫూర్తిదాయకం అని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ శ్రీనివాస్, బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రు నాయక్, నాయకులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి సీపీ తనిఖీలు



వినాయక్‌నగర్, ఫిబ్రవరి 21 : నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ మఫ్టీలో మంగళవారం అర్ధరాత్రి నగరంలో తనిఖీలు చేపట్టారు. రాత్రివేళ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో తెలుసుకున్నారు. అర్ధరాత్రి హోటళ్లు, పాన్ కోకాలు, టీ స్టాళ్లు తెరిచిఉండడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తంచేశారు.